సంక్రాంతి ముసుగులో కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు : ఎస్‌పి

కోడి పందేలకు సిద్ధం చేస్తున్న బరిని ధ్వంసం చేస్తున్న ఎస్‌పి

మొగల్తూరు : సంక్రాంతి పండుగ పేరుతో చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌పి యు.రవిప్రకాష్ హెచ్చరించారు. సంక్రాంతి సందర్భంగా జిల్లాలో కోడిపందేలు, పేకాట, గుండాట వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించకూడదన్నారు. గురువారం నరసాపురం, మొగల్తూరు మండలాల్లో అనుమానిత ప్రాంతాల్లో పర్యటించారు. అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పాత నేరస్థులపై బైండోవర్ కేసులు నమోదు చేయాలని అధికారులకు ఆదేశించారు. ఆయన వెంట నరసాపురం డిఎస్‌పి కె.రవి మనోహరచారి, సిఐ జి.శ్రీనివాస్ యాదవ్, ఎస్ఐలు సుధాకర్ రెడ్డి, వీరబాబు ఉన్నారు.

ధాన్యం.. దైన్యం..!

ఇప్పటికీ వీడని కొనుగోలు సమస్యలు
బ్యాంకు గ్యారెంటీ సమస్యతో రైతులకు ముప్పతిప్పలు
రోడ్డెక్కుతున్న రైతులు
తేమశాతంలో తేడా సమస్యపై తీవ్ర ఆగ్రహం
రబీలో ధాన్యం కొనుగోలుపై రైతుల్లో ఇప్పటి నుంచే బెంగ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ధాన్యం కొనుగోలు సమస్య అత్యంత ఇబ్బందికరంగా మారింది. ధాన్యం కొనుగోలు ప్రారంభించి నెల రోజులు గడుస్తున్నా ఇప్పటికీ రైతులను సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. ఆదిలో లారీలు, గోనెసంచులు, యాప్ సమస్యతో సతమతమైన రైతులు ఇప్పుడు బ్యాంకు గ్యారెంటీ సమస్యతో నలిగిపోతున్నారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో ఏలూరు జిల్లాలోని రైతులు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు. రెండు జిల్లాలవ్యాప్తంగా ఖరీఫ్‌లో దాదాపు 4.50 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేపట్టారు. పశ్చిమలో 3.42 లక్షలు, ఏలూరు జిల్లాలో 3.80 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. ఇప్పటి వరకూ రెండొంతుల ధాన్యం కొనుగోలు చేసినట్లు లెక్కలు చెబుతున్నాయి. ఏలూరు జిల్లాలో ఇంకా లక్ష టన్నుల వరకూ ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది. పశ్చిమలోనూ ఇంకా ధాన్యం కొనుగోలు జరగాల్సి ఉంది. రబీ మాసూళ్లు పూర్తవుతున్నా ఇంకా ఖరీఫ్ ధాన్యం కొనుగోలు చేయని దుస్థితి నెలకొంది. మాసూళ్లు చేసి పది రోజులు గడిస్తే తప్ప ఏఒక్క రైతు నుంచీ ధాన్యం కొనుగోలు చేయడం లేదు. ముఖ్యంగా రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య తేమ శాతం. ఆర్‌బికె సిబ్బంది 17శాతంలోపు తేమ ఉందని నిర్ధారించి ధాన్యం లారీల్లో పంపిన తర్వాత మిల్లుల వద్ద 20 శాతం, ఆపైన తేమ ఉందని ధాన్యం దింపుకునేందుకు మిల్లర్లు ససేమిరా అంటున్నారు. దీంతో రైతులు ఏం చేయాలో తెలీక తేమశాతానికి సంబంధించి సొమ్ము చెల్లించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. శనివారం జరిగిన జిల్లా పరిషత్ సమావేశంలోనూ జెడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు ఇదే విషయమై ప్రశ్నించగా వ్యవసాయ, పౌరసరఫరాల శాఖ అధికారులు సంతృప్తికరమైన సమాధానాలు ఇవ్వలేని దుస్థితి నెలకొంది. మిల్లర్లకు, ఆర్‌బికెలకు మధ్య తేమశాతం ఎందుకు తేడా వస్తుందో సరైన సమాధానం చెప్పడం లేదు. తేమశాతం సమస్య రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. బ్యాంకు గ్యారెంటీలు అయిపోయాయంటూ ధాన్యం లోడు చేసిన తర్వాత ఆగిపోవడంతో ఏలూరు మండలం జాలిపూడిలో రైతులు రోడ్డెక్కి ధర్నా చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. దీన్నిబట్టి ఇప్పటికీ ధాన్యం కొనుగోలు ఇబ్బందులతో రైతులు ఏవిధంగా నలిగిపోతున్నారో స్పష్టమవుతోంది. ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు లేకుండా చేయాల్సిన అధికారులు పట్టించుకోకపోవడం వల్లే సమస్యలు వెంటాడుతున్నట్లు రైతుల్లో చర్చ సాగుతోంది. బ్యాంకు గ్యారెంటీలపై అప్రమత్తత లేకపోవడం కారణంగానే రైతులకు తీవ్ర ఇబ్బందులు నెలకొన్నాయని తెలుస్తోంది.

రబీలో ధాన్యం కొనుగోలుపై ఇప్పటినుంచే బెంగ

ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో తీవ్ర ఇబ్బందులు చవిచూసిన రైతులు రబీపై ఇప్పటి నుంచే బెంగ పెట్టుకుంటున్నాడు. రబీకి సంబంధించి ఇప్పటికే సగానికిపైగా నాట్లు పూర్తయ్యాయి. సంక్రాంతికి పూర్తిస్థాయిలో రబీ నాట్లు పూర్తయ్యే అవకాశం ఉంది. ఏప్రిల్ నుంచి రబీ మాసూళ్లు ప్రారంభమయ్యే పరిస్థితి ఉంది. ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఖరీఫ్ మాదిరిగా ఇబ్బందులు ఉంటే పరిస్థితి ఏమిటనే భయం అన్నదాతను వెంటాడుతోంది. రబీలోనైనా ధాన్యం కొనుగోలు సమస్య లేకుండా చేయగలరా అనే చర్చ రైతుల్లో నడుస్తోంది. ధాన్యం కొనుగోలులో ఇబ్బందులతో వరిసాగుపై రైతుల్లో విరక్తి నెలకొంది. రబీ ధాన్యం కొనుగోలుపై ప్రభుత్వం ఇప్పటి నుంచే సరైన ప్రణాళికతో ముందుకు సాగకపోతే రైతుల ఆగ్రహం చవిచూడక తప్పదు.

భూముల రీ సర్వే త్వరగా పూర్తిచేయాలి

వీరవాసరం:జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకంలో భాగంగా చేపట్టాల్సిన రీ సర్వే రెండో విడత పనులు ఈ నెల పదో తేదీ నుండి జిల్లాలో అన్ని మండలాల్లో ప్రారంభించి సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఆమె మండలంలోని అండలూరులో పర్యటించారు. అండలూరులో రెండో విడత సర్వే పనులను ఆమె పరిశీలించారు. సర్వే ఆఫ్ ఇండియా అధికారుల ఆధ్వర్యంలో డ్రోన్ ద్వారా తీసుకున్న గ్రౌండ్ కంట్రోల్ పాయింట్‌లను కలెక్టర్‌తో పాటు జెసి జెవి.మురళీ పరిశీలించారు. ఇందుకు సంబంధించిన మ్యాప్‌లను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే జిల్లాలో అన్ని మండలాల్లో ఒకటి, రెండు గ్రామాలను పైలెట్ ప్రాజెక్ట్‌గా తీసుకుని నూరు శాతం సర్వే పనులు పూర్తి చేశామన్నారు. మండలంలోని నేల పోగుల గ్రామంలో పూర్తయిన రీ సర్వే పనుల స్ఫూర్తితో మిగిలిన గ్రామాల్లో కూడా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్వే అధికారి జాషువ, సర్వే ఆఫ్ ఇండియా అధికారి భాస్కర్‌రావు, తహశీల్దార్ సుందరాజు, మండల సర్వేయర్ శైలజ పాల్గొన్నారు.

వైసిపిలో భగ్గుమన్న గ్రూపు విభేధాలు

ప్రజాశక్తి - పాలకోడేరు


ఘర్షణ పడుతున్న కార్యకర్తలు

ఉండి నియోజకవర్గ వైసిపిలో గ్రూపు విభేధాలు మరోసారి తెరపైకి వచ్చాయి. వైసిపి అధికారం చేపట్టిన నాటి నుంచి ఏదో రూపంలో ఈ గ్రూపు విభేధాలు తరచూ బయటపడుతూనే ఉన్నాయి. మరొకసారి ఈ విభేధాలు తెరపైకి రావడానికి కోరుకొల్లు గ్రామంలో పెన్షన్ పంపిణీ వేదికైంది. ఇటీవల నూతనంగా మంజూరైన పెన్షన్ల పంపిణీని గ్రామంలో గురువారం ఏర్పాటు చేశారు. అయితే ఈ కార్యక్రమానికి విచ్చేసిన డిసిసిబి ఛైర్మన్, ఉండి నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజును రాష్ట్ర అటవీశాఖ అభివృద్ధి డైరెక్టర్, జిల్లా యూత్ విభాగ అధ్యక్షులు మంతెన యోగేంద్రకుమార్(బాబు), గ్రామ వైసిపి నాయకులు అడ్డుకున్నారు. పెన్షన్ల పంపిణీ సమాచారం తమకు లేదంటూ పంపిణీ చేయడం వీలు లేదంటూ పంచాయతీ ఆవరణలో పివిఎల్‌ను అడ్డుకున్నారు. పివిఎల్ గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. ఈ నేపథ్యంలో అక్కడ ఘర్షణ వాతావరణం ఏర్పడింది. ఇరు గ్రూపులు బాహాబాహీకి దిగాయి. నువ్వు ఎంత అంటే నువ్వు ఎంతనే స్థాయిలో విమర్శలు చేసుకున్నారు. దీంతో స్థానికంగా ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో అక్కడ ఉన్న పోలీసులు ఇరుగ్రూపులను సముదాయించారు. అయినా ఒక గ్రూపు పెన్షన్ల పంపిణీ కుదరదని గో బ్యాక్ గో బ్యాక్ పిపివిఎల్ అంటూ నినాదాలు చేశారు. దీంతో భారీస్థాయిలో మాటల యుద్ధం జరిగింది. దీంతో పివిఎల్.నరసింహారాజు పెన్షన్లు పంపిణీ చేయకుండానే అక్కడి నుంచి వెనుతిరిగారు. అనంతరం గ్రామ సర్పంచి మంతెన భారతి, పంచాయతీ పాలకవర్గ సభ్యులు కలిసి నూతనంగా మంజూరైన 14 పెన్షన్లను లబ్ధిదారులకు అందజేశారు.

ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్‌గా జవహర్‌లాల్ రాజు

ప్రజాశక్తి - భీమవరం

ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్‌గా జవహర్‌లాల్ రాజు ఎన్నికయ్యారు. స్థానిక ఎస్‌టియు కార్యాలయంలో ఫ్యాప్టో జిల్లా నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షులు ఎల్.సాయిశ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. ఎస్‌టియు, యుటిఎఫ్, ఎపిటిఎఫ్257, డిటిఎఫ్ సంఘాలు ఈ ఎన్నికల్లో పాల్గొన్నాయి. ఫ్యాప్టో ఛైర్మన్‌గా బిహెచ్.జవహర్‌లాల్ రాజు (ఎస్‌టియు), జనరల్ సెక్రటరీగా బి.కార్తీక దామోదర్(డిటిఎఫ్), డిప్యూటీ సెక్రటరీ జనరల్‌గా పిఎస్.విజయరామరాజు(యుటిఎఫ్), జి.ప్రకాశం(ఎపిటిఎఫ్), సెక్రటరీలుగా సిహెచ్.పట్టాభిరామయ్య, పి.జనార్థనస్వామి, కోశాధికారిగా వి.జనార్థన్‌రావు, కార్యవర్గ సభ్యులుగా ఎకెవి.రామభద్రం, కెవి.రామచంద్రరావు, బివి.నారాయణను ఎన్నుకున్నారు. ఉపాధ్యాయులకు ప్రతినెల ఒకటో తేదీన జీతాలందించాలని, ఉద్యోగులకు డిఎలు, పిఎఫ్, ఎపిజిఎల్ఐ, బకాయిలను వెంటనే చెల్లించాలని, సిపిఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని నూతన కార్యవర్గం ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ తీర్మానించింది. సందర్భంగా ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షులు సాయి శ్రీనివాసరావు మాట్లాడుతూ పెండింగ్ సమస్యలు పరిష్కరించకపోతే అన్ని ఉపాధ్యాయ సంఘాలు ఐక్యంగా ఏర్పడి ఫ్యాప్టో ద్వారా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

జగనన్న ఇళ్లు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - భీమవరం

నవరత్నాలు - పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా జగనన్న కాలనీల్లో నిర్మాణాలు వేగవంతం చేయాలని ప్రభుత్వ చీఫ్‌సెక్రటరీ కెఎస్.జవహర్‌రెడ్డి అన్నారు. గురువారం వెలగపూడి సచివాలయం నుంచి స్పందన, రెవెన్యూ, రీసర్వే, అగ్రికల్చర్, హార్టీకల్చర్, హౌసింగ్, గ్రామ, వార్డు సచివాలయాలు, వివిధ ప్రభుత్వ పథకాల అమలుపై కలెక్టర్లు, జెసిలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. భీమవరం కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జెసి జెవి.మురళీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఉగాది నాటికి కేటాయించిన లక్ష్యానికి అనుగుణంగా ఐదు లక్షలు ఇళ్ల పూర్తి చేయాలన్నారు. రబీ సీజన్ ఇ-క్రాప్ బుకింగ్ ప్రక్రియను నిర్దేశిత గడువులోగా నూరు శాతం పూర్తిచేయాలన్నారు. పిఎం కిసాన్ పథకం అర్హులైన రైతులకు వర్తించేందుకు వీలుగా రైతుల నుంచి ఇకెవైసి తప్పకుండా చేయించాలన్నారు. అనంతరం కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తిచేస్తామని చెప్పారు. ఈ మేరకు ఆయా శాఖల అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎడి జాషువ, పంచాయతీ రాజ్ ఎస్ఇ శ్రీనివాసరావు, డిఎంహెచ్ఒ మహేశ్వరరావు, డ్వామా పీడీ రాజేశ్వరరావు, జిల్లావ్యవసాయ శాఖ అధికారి వెంకటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయులు అన్నే వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - ఏలూరు

నేడు వర్ధంతి సభ



ఆదర్శప్రాయులు, అమరజీవి, స్వాతంత్ర్య సమరయోధులు, రైతు-ప్రజా నేత అన్నే వెంకటేశ్వరరావు 20వ వర్ధంతి సభ ఈనెల ఆరో తేదీన ఏలూరులో జరగనుంది. ఆయన కృష్ణాజిల్లా ఆత్కూరులో 1916లో జన్మించారు. తల్లిదండ్రులు 1927లో ఆత్కూరు నుండి ఏలూరు రూరల్ మండలం సత్రంపాడుకు వచ్చి స్థిరపడ్డారు. ఆయన తన 15వ ఏట ఏలూరులో గాంధీ పిలుపుమేరకు ఉప్పు సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొన్నారు. అరెస్లయ్యి తొమ్మిది నెలలు జైలు జీవితం గడపడం ద్వారా ప్రజా జీవితాన్ని ఆరంభించారు. ప్రముఖ నేతలు పుచ్చలపల్లి సుందరయ్య, గారపాటి సత్యనారాయణ సహచర్యం, గోర్కి 'అమ్మ' నవల చదవడంతో ఉత్తేజం పొందారు. తొలుత కాంగ్రెస్‌లో, తర్వాత కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీలో, ఆ తరువాత కమ్యూనిస్టు పార్టీలో చేరి అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించారు. బ్రిటిష్ ప్రభుత్వం నిషేధించిన 'స్వతంత్ర భారత్' పత్రికను అన్నే సంచిలో పెట్టిన పోలీసులు, ఆయనను అరెస్టు చేసి జైలు శిక్ష వేయించి కోయంబత్తూరు జైలుకు పంపారు.

పోరుబాటలో అన్నే వెంకటేశ్వరరావు..

1948లో రాజమండ్రిలో, 1949లో సేలంలో, 1964లో చంచల్‌గూడలో, 1968లో అండమాన్ జైలులో శిక్షలు అనుభవించారు. మొత్తంగా 12 సంవత్సరాల పాటు జైలు జీవితం గడిపారు. బ్రిటిష్ కాలంలోనే పెదపాడు, రాజుపేట, నాయుడుగూడెంలో జమిందారీ వ్యతిరేక పోరాటాల్లో చురుగ్గా పాల్గొన్నారు. హుకుంపేట, బుచ్చిపాలెం, పెండ్యాల, కానూరు అగ్రహారం పేదల ఉద్యమాలతో సన్నిహిత సంబంధం కలిగి ఉన్నారు. కొల్లేరులోని గుడివాకలంక, పత్తికోళ్లలంక మోతేవారిలంక, పంగిడిగూడెం, శ్రీపర్రులో, నిడమర్రు మండలంలోనూ భూస్వాముల పెత్తనానికి వ్యతిరేకంగా ఉద్యమాలు నడపడంలో ముఖ్యపాత్ర వహించారు. వేలాది ఎకరాలు దళిత, పేదల స్వాధీనంలోకి రావడానికి జరిగిన ఉద్యమాలు, కృషిలో అన్నే వెంకటేశ్వరరావు ముఖ్యపాత్ర పోషించారు.

నిరంతర అధ్యయనం - ఆందోళనల మయం

అన్నే వెంకటేశ్వరరావు మంచి అధ్యయన శీలి. చిన్నప్పటి నుంచి అభ్యుదయ సాహిత్యం, దినపత్రికలు చదివేవారు. జైలులోనే ఇంగ్లీషు నేర్చుకున్నారు. కంటిచూపు ఇబ్బంది ఉన్నా చివరి వరకూ భూతద్దంతో పత్రికలు, సాహిత్యం చదువుతూ అంతర్జాతీయ, జాతీయ పరిస్థితులపై అవగాహనతో సహచరులతో చర్చించేవారు. తెలుగు పత్రికలతో పాటుగా హిందూ పత్రికను చదివేవారు. ప్రభుత్వ డాక్యుమెంట్లు చదవడం ద్వారా తెలుసుకుని అందరికీ అర్థమయ్యే భాషలో కరపత్రాలు, వ్యాసాలు, నోట్ లు రాసేవారు. కొల్లేరు సమస్యల లోతుపాతులపై ఒక పుస్తకం కూడా రాశారు. ఆయన కరపత్రాలు జనం భాషలో పదునైన పదాలతో ఉండేవి.

నిరాడంబరం, ఉత్తేజభరితం అన్నే జీవితం

ఏలూరు పట్టణంలో అన్నిచోట్లకు, ఏలూరు తాలూకా గ్రామాలన్నింటా సైకిల్‌పైనే విస్తతంగా తిరిగి ప్రజాసమస్యలపై ఉద్యమాలు సాగించారు. 80 ఏళ్ల వయసులోనూ సైకిల్ మీదే తిరిగేవారు. ప్రతి ప్రజా సమస్య మీద స్పందించి అధికారుల వద్దకు నిరంతరం ప్రజలను తీసుకెళ్లి రాయబారాలు చేసేవారు. వేషధారణలోను, వ్యవహార శైలిలోను నిరాడంబరత, నమ్రత సహజంగా కనిపించేవి. అన్నే వెంకటేశ్వరరావు కష్టాలను ఎదుర్కొనడంలో అనేక ఉద్యమాలు సాగించడంలో ఆయన జీవితభాగస్వామి, ఉద్యమ సహచరి అన్నే అనసూయమ్మ తోడునీడగా ఉండేవారు. భార్యాభర్తలుగానే కాక ఉద్యమ సహచరులుగా వారిద్దరి జీవితం పెనవేసుకుపోయింది. అన్నే వెంకటేశ్వరరావు 2003 జనవరి ఆరో తేదీన తుదిశ్వాస విడిచారు. ఆయన ఏ పరిస్థితుల్లో ఉన్నా మార్పు కోసం అయితే జీవితాంతం కృషి చేశారో ఆ పరిస్థితులు నేడు మరింత ప్రాధాన్యత సంచరించుకున్నాయి.

ప్రజా కవి సుంకర సత్యనారాయణ సోదరి అన్నే అనసూయతో రాజకీయ పాఠశాలలో ఏర్పడిన పరిచయంతో 1944 ఏప్రిల్ 24న వివాహం జరిగింది. ఆ విధంగా అనసూయ కోరి మరి ప్రజాఉద్యమాలను జీవితంలో భాగం చేసుకున్నారు. జీవితంలో అనేక ఆటు పోట్లు వచ్చినా, ధీరోదాత్తంగా ఎదుర్కొన్నారు. జీవితాంతం ప్రజల ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. కుమారుడు రవి, కుమార్తె కల్పన చిన్నపిల్లలుగా ఉన్నప్పుడే వారిని కూడా తీసుకుని రాయవెల్లూరు, నందిగామ జైళ్లలో రెండు సంవత్సరాలు జైలు జీవితం గడిపారు. భర్త ఉద్యమాలు, 12 ఏళ్ల జైలు జీవితం అనుభవించిన కాలంలో ఎల్ఐసి ఏజెంటుగా పనిచేసి కుటుంబాన్ని పోషించారు. కుటుంబంలోని వారందరిని మూఢ, మత భావాలకు వ్యతిరేకంగా అభ్యుదయ భావాలతో ఉండేలా పెంచారు.

అన్నే అనసూయ, వెంకటేశ్వరరావు పేరుతో విజ్ఞాన కేంద్రం

స్వాతంత్ర్య ఉద్యమం, కొల్లేరు ప్రాంత, అటవీ హక్కుల, పేదలు ఉద్యమాలతో సంబంధాలు కలిగి ఉన్న సమరయోధులు, త్యాగమయ జీవితాలు గడిపిన అన్నే వెంకటేశ్వరరావు, అన్నే అనసూయల పేరుతో ఏలూరులో అన్నే అనసూయ, వెంకటేశ్వరరావు విజ్ఞాన కేంద్రం 2019లో ప్రారంభించారు.

నేడు పవర్‌పేటలోని ఉద్దరాజు భవనంలో సదస్సు
- హాజరుకానున్న ఎంఎల్‌సిలు

అన్నే వెంకటేశ్వరరావు వర్ధంతి సందర్భంగా శుక్రవారం సాయంత్రం 4 గంటలకు పవర్‌పేటలోని ఉద్దరాజు రామం భవనంలో సదస్సు జరగనుంది. ఈ సదస్సుకు ముఖ్యఅతిథులుగా ఎంఎల్‌సిలు కెఎస్.లక్ష్మణరావు అతిథిగా ఎంఎల్‌సి షేక్ సాబ్జీ పాల్గొంటారు. ఏలూరు నగరంలోని అన్ని కాలేజీల్లో ఐదో తేదీన విడివిడిగా 'భారత స్వాతంత్ర్య పోరాటంలో పశ్చిమ గోదావరి జిల్లా వాసుల పాత్ర' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి అందులో ప్రతీ కాలేజీ నుండి ముగ్గురికి ఆరో తేదీ సభలో బహుమతులు ఇవ్వనున్నారు. ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కంప్యూటర్ శిక్షణా కేంద్రం 18వ బ్యాచ్ అభ్యర్థులకు సర్టిఫికెట్ల ప్రదానం, హేలాపురి బాలోత్సవం సెంటర్స్ టీచరు, విద్యార్థులకు దుస్తులు, పుస్తకాలు పంపిణీ చేస్తారు.

జిఒ 1ను ఉపసంహరించుకోవాలని ఆందోళనలు

తణుకు రూరల్: ప్రతులను దహనం చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - తణుకురూరల్

సభలు, సమావేశాలు, ర్యాలీలు నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జిఒ 1ని రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పివి.ప్రతాప్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక నరేంద్ర సెంటర్‌లో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన, ధర్నా నిర్వహించి, జిఒ కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎ.అజయకుమారి, కామన మునిస్వామి, గార రంగారావు, పిడి మూర్తి, గుబ్బల గోపి, కె.నాగరత్నం, వి.ఎ.రాజు, ఎం.రమేష్, వై.లక్ష్మీనాయుడు, బి.శివ, పి శివగణేష్, పి.అప్పన్న పాల్గొన్నారు.

పోడూరు:రాష్ట్ర ప్రభుత్వం పోరాటాలను అణచి వేయాలని తీసుకొచ్చిన జిఒను వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్, మండల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం వామపక్షాల ఆధ్వర్యంలో పోడూరు బల్ల వంతెన వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం ప్రజల హక్కులను కాలరాసే విధంగా వ్యవహరిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.మోజేష్, కె.వెంకటేశ్వర్లు, రాపాక.కుమార్, బొల్ల పెద్దిరాజు పాల్గొన్నారు.

ఉండి : ప్రభుత్వం విడుదల చేసిన జిఒ 1ని తక్షణం రద్దు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సిపిఐ ఉండి ఏరియా ఆధ్వర్యంలో జిఒ ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా కోనాల భీమారావు మాట్లాడారు. ప్రభుత్వం ప్రజా, ప్రతిపక్షాల గొంతు నొక్కే విధంగా జిఒను జారీ చేసిందని విమర్శించారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కలిశెట్టి వెంకట్రావు, నాయకులు తమ్మురాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

భీమవరం రూరల్:వైసిపి ప్రభుత్వం జిఒ 1ని ఉపసంహరించుకోవాలని టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి తెలిపారు. పట్టణంలోని టిడిపి కార్యాలయం వద్ద టిడిపి ముఖ్య నాయకుల అత్యవసర సమావేశం గురువారం నిర్వహించారు. అనంతరం జగన్ సర్కార్ తీసుకొచ్చిన జిఒ 1 కాపీ ప్రతులను దహనం చేశారు. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తోట సీతారామలక్ష్మి మాట్లాడారు. చంద్రబాబు కుప్పం పర్యటనను అడ్డుకుంటూ టిడిపి కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టడం అన్యాయమని విమర్శించారు. వెంటనే జిఒను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారధి మాట్లాడుతూ సభలు, ర్యాలీలను నిషేధిస్తూ జిఒ జారీ చేయడం సరికాదన్నారు. డ్వాక్రా, అంగన్వాడీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెరగాని నారాయణమ్మ, ఎస్‌సి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండి నౌషాద్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష కార్యదర్శులు రేవు వెంకన్న, కౌరు పృథ్వీశంకర్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తమ్మినీడి నాగేశ్వరరావు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

తణుకు: రాజకీయ పార్టీల హక్కులను, స్వేచ్ఛను హరించే విధంగా వైసిపి ప్రభుత్వం జిఒ జారీ చేసిందని, దాన్ని రద్దు చేయాలని కోరుతూ తణుకు మాజీ శాసనసభ్యులు రాధాకృష్ణ ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదురుగా అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అనంతరం జిఒ కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిఒ జారీ చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే విమర్శించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కలగన వెంకటకృష్ణ, బసవ రామకృష్ణ, దొమ్మేటి వెంకట సుధాకర్, గుబ్బల శ్రీనివాస్ పాల్గొన్నారు.

భీమవరం రూరల్: ప్రతులను దహనం చేస్తున్న టిడిపి నాయకులు

చంద్రబాబుది శవ రాజకీయం : మంత్రి కారుమూరి

ప్రజాశక్తి - అత్తిలి

అత్తిలి :లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి కారుమూరి

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జిఒ జారీ చేసినా చంద్రబాబు నాయుడు తనకిష్టంవచ్చినట్లు బహిరంగ ప్రదేశాల్లో సభలు ఏర్పాటు చేసుకుని శవ రాజకీయం చేస్తున్నాడని రాష్ట్ర పౌరసర శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. గురువారం అత్తిలి సుబ్రహ్మణ్యేశ్వర ఆలయం వద్ద ఉన్న భవనంలో కొత్తగా మంజూరైన పింఛన్లు, రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో జన్మభూమి కమిటీల పేరుతో లబ్ధిదారులను నమ్మించి దాచుకోండి దోచుకోండి అన్న చందంగా పాలన సాగిందన్నారు. తెల్లవారేసరికి లబ్ధిదారులకు పెన్షన్లు అందిస్తుంటే చంద్రబాబు నోటికొచ్చినట్లు తిట్టడం సిగ్గుచేటన్నారు. అత్తిలిలో 298 కొత్త పింఛన్లు మంజూరయ్యాయని, 12 మంది పెన్షన్లు అనివార్య కారణాల వల్ల అనర్హులుగా గుర్తించినట్లు తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు పింఛన్లు, రేషన్‌కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి విదేత, జెడ్‌పిటిసి సభ్యురాలు అడ్డాల జానకి, రైస్ మిల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కూనపురెడ్డి జయరాజు, మండల విప్ అమ్మిరెడ్డి పాల్గొన్నారు.

ఆచంట : అర్హులందరికీ ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేస్తుందని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. గురువారం సాయంత్రం ఆచంట శ్రీరామేశ్వరస్వామి సత్రంలో సర్పంచి కోట సరోజినీ వెంకటేశ్వరరావు అధ్యక్షతన నూతనంగా మంజూరైన పెన్షన్ పంపిణీ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ముఖ్యమంత్రి అర్హులందరికీ తెల్లవారుజామునే వాలంటీర్ల ద్వారా పెన్షన్ అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్య, ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్‌బాబు, ఎంపిడిఒ జగన్నాధరావు పాల్గొన్నారు.

ప్రాణాలు పోతుంటే ఊరుకోవాలా : మంత్రి కొట్టు

తాడేపల్లిగూడెం:ప్రజల ప్రాణాలు పోతుంటే ప్రభుత్వం చూస్తూ ఊరుకోవాలా, రాష్ట్రంలో కొనసాగుతున్న నారావారి నరమేధాన్ని ఆపేందుకే ప్రభుత్వం ఒకటో నంబర్ జిఒను తీసుకొచ్చిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మంత్రి కొట్టు సత్యనారాయణ స్పష్టం చేశారు. గురువారం క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు అధికార దాహంతో ఇటీవల రాష్ట్రంలో రోడ్ షోలు, సభలు నిర్వహిస్తూ ప్రజల ప్రాణాలు తీస్తున్నారని విమర్శించారు. ఏమాత్రం పశ్చాత్తాపం లేకుండా చంద్రబాబు తన పర్యటనలను కొనసాగించడం ఆయన రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. కందుకూరులో ఎనిమిది మంది, గుంటూరులో ముగ్గురు చనిపోవడానికి చంద్రబాబు కారణమన్నారు. అధికార వైసిపి తన రాజకీయ స్వప్రయోజనాలను సైతం పక్కన పెట్టి ఈ జీవోను తీసుకొచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కొలుకులూరి ధర్మరాజు, బోనం విజయనిర్మల, చింతకాయల సత్యనారాయణ, చామన సూర్యచంద్రరావు మాస్టారు పాల్గొన్నారు.

రైస్‌మిల్లు తెరవాలని ధర్నా

పెంటపాడు:ప్రత్తిపాడు రైస్ మిల్లును తిరిగి తెరవాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన పెంటపాడు తహశీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు సిరపరపు రంగారావు, చిర్ల పుల్లారెడ్డి మాట్లాడారు. ప్రత్తిపాడు కళ్యాణి రైస్‌మిల్లు 1985లో స్థాపించి కొంతకాలం పనిచేసిందని తెలిపారు. రాజమండ్రి ఐడిపి బ్యాంకులకు అప్పు ఉన్న కారణంగా మిల్లును చేశారని, దీంతో అక్కడ పనిచేస్తున్న కార్మికులు ఆకలితో అల్లాడిపోతున్నారని తెలిపారు. 12 సంవత్సరాల క్రితం మూసివేసిన మిల్లును తెరవాలని, మిల్లు యాజ మాన్యాలను అడిగితే తర్వాత తెరుస్తామని చెబుతున్నారని తెలిపారు. వెంటనే కార్మికులకు రావాల్సిన వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



సిబ్బందికి చీరలు పంపిణీ చేస్తున్న కొట్టు విశాల్

వాలంటీర్లకు జీతాలు పెంచాలి

ప్రజాశక్తి - పెంటపాడు

గ్రామ వాలంటీర్లకు జీతాలు పెంచాలని మంత్రి తనయుడు కొట్టు విశాల్ తెలిపారు. గురువారం పెంటపాడు సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ నివాసంలో గ్రామ వాలంటీర్లకు, పంచాయతీ సిబ్బందికి, ఆశా వర్కర్లకు చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. అనంతరం 170 మందికి ఆయన చీరలు పంపిణీ చేశారు. పింఛన్లు ఇచ్చే విషయంలో అందరికీ అందే విధంగా శ్రద్ధ చూపాలని తెలిపారు. అనంతరం సర్పంచి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తాడేపల్లి వంశీ, ఎంపిటిసి సభ్యులు రెడ్డి సూరిబాబు, జుపల్లి నాగమణి, నాయకులు కొప్పూరు ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

కోడి పందేలను అడ్డుకోవాలి

ప్రజాశక్తి - కాళ్ల

సంక్రాంతి పండుగ నేపథ్యంలో మండలంలో కోడిపందేలు నిర్వహించకుండా చూడాలని తహశీల్దార్ టి.వి.కృష్ణారావు అధికారులను ఆదేశించారు. కాళ్ల మండల పరిషత్ కార్యాలయంలో మండలస్థాయి అధికారుల ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేడుకల పేరిట కోడి పందేలను నిషేధిస్తూ రాష్ట్ర హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వులను పటిష్టంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో రెవెన్యూ, పోలీస్, పశు సంవర్థక శాఖ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక టాస్క్ ఫోర్స్ టీములు రానున్న మూడు రోజులపాటు నిరవధికంగా తనిఖీలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ జి.స్వాతి, సబ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.మల్లికార్జునరెడ్డి, ఇఒ పిఆర్‌డి ఎవి.భాస్కరరావు, విఆర్‌ఒలు, సెక్రటరీలు పాల్గొన్నారు.

'యువశక్తి'ని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఈ నెల 12వ తేదీన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ శ్రీకాకుళం జిల్లాలో తలపెట్టిన యువశక్తి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షులు కోటికలపూడి గోవిందరావు (చినబాబు) తెలిపారు. పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యువత ఆలోచనలను ఈనెల 5 నుంచి 8వ తేదీ వరకూ 80699 32222 నంబరుకు తెలియజేయవచ్చని తెలిపారు. బ్రిటీష్ పాలన కన్నా చెత్త పాలన జగన్‌ది అన్నారు. జిఒ 1 ద్వారా భావ స్వేచ్ఛను ఆటంకం కలిగించినట్లేనని తెలిపారు. అనంతరం యువశక్తి కరపత్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో పట్టణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నరసాపురం టౌన్ : ఈ నెల 12వ తేదీన శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో నిర్వహించే యువశక్తి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జనసేన నియోజకవర్గ నాయకుడు బొమ్మిడి నాయకర్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం యువతను ఓటు బ్యాంకుగా మాత్రమే ఉపయోగించుకుంటోందన్నారు. ఈ కార్యక్రమంలో జక్కం బాబ్జి, కోటిపల్లి వెంకటేశ్వరరావు, వలవల నాని, ఆకన చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆలయ పున:నిర్మాణానికి ఎంఎల్‌ఎ విరాళం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

వన్‌టౌన్‌లోని కిష్మిందపురంలో సీతా రామలింగేశ్వర స్వామి పురాతన ఆలయ నిర్మాణానికి ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ తన కుటుంబ సభ్యుల పేరిట రూ.10 లక్షల 33 వేలు విరాళంగా ఆలయ అధికారులకు గురువారం స్థానిక క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ ఆలయ పున:నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం ద్వారా రూ.కోటి నిధులు మంజూరు చేయించడం జరిగిందన్నారు. త్వరలోనే ఆలయ నిర్మాణ పనులను ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఒలు తోట శ్రీనివాసరావు, కిషోర్, ఆలయ పాలకమండలి చైర్మన్ మందారపు శ్యాంసుందర్‌రావు పాల్గొన్నారు.

విద్యార్థులకు నవోదయ పుస్తకాలు

ప్రజాశక్తి - పాలకొల్లు

నవోదయ హైస్కూల్లో 6వ తరగతిలో చేరడానికి 5వ తరగతి విద్యార్థులకు ఇచ్చిన పుస్తకాలను సద్వినియోగం చేసుకుని ఎంట్రన్స్ పరీక్షలో ఉత్తీర్ణులు కావాలని ఎంఇఒ ఎవిఎస్‌వి.ప్రసాద్ కోరారు. పాలకొల్లు వీవర్స్ కాలనీలోని జెడిఎస్‌విఆర్‌ఎం మున్సిపల్ పాఠశాలలో 5వ తరగతి విద్యార్థులకు భీమవరం ఆర్‌డిఒ దాసి రాజు ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన నవోదయ ఎంట్రన్స్ పుస్తకాలను ఆయన గురువారం పంపిణీ చేశారు. గతంలో పాఠశాల హెచ్‌ఎం రాయపూడి భవాని ప్రసాద్ విద్యార్థులకు చేస్తున్న సేవలకు ఆకర్షితులై ఆర్‌డిఒ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ విద్యార్థులు నవోదయ పాఠశాలలో చదివితే వారికి మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ జనార్ధన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రిస్టియన్, మైనార్టీ సెల్ చైర్మన్‌గా జాన్సన్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

వైసిపి సీనియర్ నాయకులు మేడిది జాన్సన్‌ను పార్టీ అధిష్టానం రాష్ట్ర క్రిస్టియన్, మైనార్టీ సెల్ చైర్మన్‌గా నియమించింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ సందర్భంగా ఆయన ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్‌ను క్యాంపు కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ జాన్సన్‌ను అభినందించి మాట్లాడారు. వైసిపిలో కీలకపాత్ర వహించి పార్టీని బలోపేతం చేసే దిశగా నిరంతరం కష్టపడుతున్న జాన్సన్‌కు పార్టీ అధిష్టానం తగిన గుర్తింపు ఇచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుంటి ప్రభు తదితరులు పాల్గొన్నారు.

పిహెచ్‌సి వైద్యులు అనూషకు ఉత్తమ సేవా అవార్డు

ప్రజాశక్తి - పెనుమంట్ర



కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న డాక్టర్ అనూష

తాను జిల్లా కలెక్టర్ ప్రశాంతి చేతుల మీదుగా ఉత్తమ సేవా అవార్డు అందుకున్నట్లు పెనుమంట్ర పిహెచ్‌సి డాక్టర్ వై.అనూష తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. తాను 2019లో తూర్పుగోదావరి జిల్లా ఈ రామవరంలో కాంట్రాక్టు పద్ధతిలో వైద్యురాలిగా పనిచేశానని, తరువాత రెగ్యులర్ కావడంతో రెండు సంవత్సరాల తర్వాత స్థానికంగా బదిలీ కావడంతో వైద్య సేవలందిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా అందిస్తున్న సేవలను గుర్తించి తనకు ఈ అవార్డు వచ్చిందని తెలిపారు. కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ సేవా అవార్డు పొందడం ఆనందంగా ఉందన్నారు.

'జగన్ పాలన దారుణం'

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్రంలో బ్రిటీష్ వారి కంటే దారుణంగా జగన్ పాలన కొనసాగుతోందని టిడిపి నేతలు అంబేద్కర్ విగ్రహానికి గురువారం రాత్రి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు, ఎంఎల్‌సి రామ్మోహన్‌రావు మాట్లాడారు. రాష్ట్రంలో అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని పక్కకు పెట్టి పులివెందుల రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని విమర్శించారు. అనంతరం కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కర్నేన రోజా రమణి, జీవి కర్నేన గౌరునాయుడు, పెన్మెత్స రామ భద్ర రాజు పాల్గొన్నారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ప్రమాదకరంగా ఆలమూరు కాలువ గట్టు!

రైతుల ఆందోళన

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఆలమూరు నిమ్మతోట కాలువ గట్టు కుంగిపోయి ప్రమాదకరంగా మారింది. దీంతో ఆ ప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు. సుమారు 200 నుంచి 300 మీటర్ల మేర కాలువ గట్టు కుంగిపోతోంది. సుమారు 60 నుంచి 80 ఎకరాల ఆయకట్టు రైతులు కాల్వగట్టు గుండా తమ వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు. అయితే గట్టు కొద్దికొద్దిగా కుంగిపోతుండడంతో వ్యవసాయానికి సంబంధించి ఉత్పత్తులను రవాణా చేసుకునేందుకు ఇబ్బందిగా మారింది. ఈ మార్గం ట్రాక్టర్ల రాకపోకలకు ఆటంకంగా మారిందని రైతులు గుడిమెట్ల సూర్యనారాయణ రెడ్డి, సత్తి వెంకటరెడ్డి (చిలుక), తాడి కేశవరెడ్డి, తాడిశెట్టి వీర్రెడ్డి, గుడిమెట్ల పల్లారెడ్డి, గుడిమెట్ల శ్రీనివాస్‌రెడ్డి, గుడిమెట్ల ముసలారెడ్డి, సత్తి రంగారెడ్డి, మట్ల మళ్లెమ్మ ఆవేదన చెందుతున్నారు. దాళ్వా సమయంతోపాటు మామూలు సమయాల్లో కూడా కాల్వగట్టు గుండా వెళ్లాలంటే ఆందోళనగా ఉందన్నారు. అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న కాలువ గట్టును పటిష్ట పర్చాలని రైతులు కోరుతున్నారు.

ఆలమూరు కాలువ గట్టు

పురుగులతో ఉన్న బియ్యాన్ని పరిశీలిస్తున్న సభ్యులు

విద్యార్థులకు పురుగుల అన్నం

బిఆర్‌ఎంవి హైస్కూల్లో తీరు

ప్రజాశక్తి - పాలకొల్లు

తమకు పురుగుల అన్నం పెడుతున్నారని పాలకొల్లు బిఆర్‌ఎంవి హైస్కూల్ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు పేరెంట్స్ కమిటీ అధ్యక్షులు కెల్లా పెద్దిరాజు, సభ్యులు చల్లా ముత్యం, గెద్దాడ గోపి, అన్నాబత్తుల దుర్గా ప్రసాద్ హెడ్‌మాస్టర్‌కు గురువారం ఫిర్యాదు చేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. పాఠశాలలో పురుగులు పట్టిన బియ్యం వండుతున్నారని తెలిపారు. తాము గతేడాది ఫిబ్రవరిలో హెడ్‌మాస్టర్‌కు ఫిర్యాదు చేశామని, అయినా అదే అన్నం పెడుతున్నారని తెలిపారు. దీనిపై వంట నిర్వాహకులను కూడా ప్రశ్నించామని చెప్పారు. తమకు ఇచ్చిన బియ్యాన్ని వండుతున్నామని నిర్వాహకులు చెబుతున్నారని తెలిపారు. దీనిపై హెడ్‌మాస్టర్ ఝాన్సీలక్ష్మిని వివరణ అడగ్గా తమకు నెల కిందట వచ్చిన బియ్యాన్ని విద్యార్థులకు వండుతున్నామని, పురుగులు వస్తున్నాయని ఇప్పటికే తహశీల్దార్, ఎంఇఒకు ఫిర్యాదు చేశామని తెలిపారు. నిల్వ ఉన్న 15 క్వింటాళ్ల బియ్యాన్ని మారుస్తామని చెప్పారని తెలిపారు.

ప్రవీణ్‌కుమార్‌కు ఉత్తమ సేవా అవార్డు

ప్రజాశక్తి - పెనుమంట్ర

జిల్లా కలెక్టర్ ప్రశాంతి చేతుల మీదుగా ఉత్తమ సేవా అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందని ఆలమూరు పిహెచ్‌సి వైద్యాధికారి కడలి ప్రవీణ్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గుంటూరులో 2022 జనవరి 26న 104 సర్వీసెస్‌లో కలెక్టర్ వివేక్ యాదవ్ చేతుల మీదుగా అవార్డు పొందానని తెలిపారు. 2022 జనవరి జులై 29న జిల్లా ఉత్తమ వైద్యాధికారిగా అరబిందో సంస్థ చేతుల మీదుగా అవార్డు అందుకున్నానని తెలిపారు. ఇటీవల ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా ఉత్తమ వైద్య సేవలందించినందుకు తనకు ఉత్తమ వైద్యాధికారిగా కలెక్టర్ ప్రశాంతి అవార్డు అందజేశారని తెలిపారు. చాలా ఆనందంగా ఉందన్నారు.

ఘనంగా సీతా పాలిటెక్నిక్ సిల్వర్‌జూబ్లీ వేడుకలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పట్టణంలోని విష్ణు విద్యా సంస్థలో ఒకటైన సీతాపాలిటెక్నిక్ కళాశాల సిల్వర్ జూబ్లీ ఉత్సవాల్లో భాగంగా గురువారం 2కె రన్ ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలను కళాశాల డైరెక్టర్ దశిక సూర్యనారాయణ ప్రారంభించారు. అనంతరం సూర్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత శిఖరాలు చేరాలంటే క్రమశిక్షణ, నిబద్ధత, కష్టపడే తత్వం ఉండాలన్నారు. అలాంటి వాటికి చదువే పెట్టుబడి అన్నారు. సాంకేతిక విద్యను ప్రోత్సహించేందుకు ప్రభుత్వాలు అన్ని సదుపాయాలూ కల్పిస్తున్నాయన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డివి సుబ్బారావు మాట్లాడారు.

జవాబుదారీతనంతో పరిష్కారం చూపాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

స్పందన ఫిర్యాదులను మరింత నాణ్యతతో పరిష్కారం చూపే దిశగా చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ ప్రశాంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పందన దరఖాస్తుదారులకు జిల్లా అధికారులు జవాబుదారీతనంతో కూడిన పరిష్కారం చూపాలని తెలిపారు. అధికారులను, అర్జీదారులను సమన్వయం చేసి అర్జీదారులకు సంతృప్తికరమైన పరిష్కారం లభించే దిశగా కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కమిటీకి నోడల్ అధికారిగా జిల్లా ఇన్‌ఛార్జి జిఎస్ డబ్ల్యుఎస్ అధికారి కెసిహెచ్ అప్పారావు వ్యవహరిస్తారని, ఆడిట్ టీంలో జెడ్‌పి సిఇఒ కెవిఎస్‌ఆర్ రవికుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దాసిరాజు, పంచాయతీ రాజ్ ఇఇ అండ్ ఆర్‌డి బి.రెడ్డియ్య, డిప్యూటీ తహశీల్దార్ పిఎన్.ప్రసాద్, వైద్యాధికారి రంగమ నాయుడు ఉంటారని తెలిపారు. జిల్లా కార్యాలయాలకు అందిన స్పందన ఫిర్యాదులపై లబ్ధిదారులకు పంపిన పరిష్కారాన్ని ఆడిట్ టీమ్ తనిఖీ చేసి వారికి చూపిన పరిష్కారంపై సంతృప్తి చెందకపోతే నివేదికను జిల్లా కలెక్టర్ కార్యాలయానికి అందజేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లా అధికారులకు అందిన ఫిర్యాదును 24 గంటల్లోపు ఓపెన్ చేసి పరిశీలించి తదుపరి చర్యలకు పంపాల్సి ఉంటుందని తెలిపారు. నిర్ణీత గడువులోపుగా ఓపెన్ చేయని ఫిర్యాదులు సిఎంఒ డాష్ బోర్డులో కనిపిస్తాయనీ తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా ఏర్పడిన నాటి నుండి నేటి వరకు 11,845 స్పందన ఫిర్యాదులు అందగా వాటిలో 11,305 ఫిర్యాదులను పరిష్కరించడం జరిగిందని తెలిపారు.

రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు

ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి

ప్రజాశక్తి - మొగల్తూరు

రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. గురువారం మండలంలోని కాళీపట్నం పడమరలో నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో రూ.21 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కాళీపట్నంలో శిథిలావస్థకు చేరిన వంతెనను తొలగించి రూ.14 కోట్లతో నూతన వంతెన, పాతపాడు వరకూ రహదారి నిర్మిస్తున్నామన్నారు. అనంతరం గ్రామ సచివాలయంలో వివిధ శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు సౌజన్య, సత్యనారాయణ, ఎంపిటిసిలు, జెడ్‌పిటిసి సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

వనమూలికలతో ఆరోగ్య సంపద

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఆయుర్వేద వనమూలికలు వేల సంవత్సరాల మన పూర్వీకులు అందించిన ఆరోగ్య సంపదని ప్రముఖ ఆయుర్వేద వన మూలికల పరిశోధన శాస్త్రవేత్త డి.సుబ్బరాజు అన్నారు. భీమవరం ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఆయుష్మాన్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో ఉన్న ఆయుర్వేద వనాన్ని ఆయన పరిశీలించి సుమారు 200 రకాలైన అమూల్యమైన వనమూలికలు కళాశాలలో లభించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ కోఆర్డినేటర్ ఆర్.కృష్ణ చైతన్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయుర్వేద నిపుణులు సుబ్బరాజు మాట్లాడారు. ఆయుర్వేద వనమూలికల ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షులు ఎస్‌వి.రంగరాజు, ఆర్‌అండ్‌డి డీన్ పి.ఎ.రామకృష్ణంరాజు, మ్యాథమెటిక్స్ అండ్ హ్యూమానిటీస్ హెడ్ వెంకటపతి రాజు పాల్గొన్నారు.

మొగల్తూరులో పోలీస్ బందోబస్త్

నిలిచిన రోడ్డు నిర్మాణ పనులు

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులోని సత్తెమ్మ ఆలయం వద్ద పోలీస్ బందోబస్తుతో గురువారం చేపట్టిన రహదారి నిర్మాణ పనులు నిలిచిపోయాయి. కెనాల్ రోడ్డు నుండి సత్తెమ్మ ఆలయం వరకూ రహదారి నిర్మాణ విషయమై గత కొన్ని రోజులుగా ఇరువర్గాల మధ్య వివాదం చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో సిఐ వి.సురేష్ బాబు, ఎస్ఐ ఎం.వీరబాబు, ఎస్ ప్రియా కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నడుమ పంచాయతీ సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది పనులు చేపట్టారు. మధ్యాహ్నానికి హైకోర్టు నుండి స్టే ఉత్తర్వులు వెలువడడంతో ఆ పనులను అధికారుల మధ్యలోనే వదిలేసి వెళ్లిపోయారు.

మానవతామూర్తి వాసుదేవరాజు

ప్రజాశక్తి - భీమవరం

సాగి వాసుదేవరాజు

భీమవరంలో ఉన్న చింతలపాటి వరప్రసాద్ మూర్తిరాజు నిర్మించిన కళాశాల, విద్యాసంస్థలో వాసుదేవరాజు ప్రిన్సిపల్‌గా సేవలందించి దాని అభివృద్ధే తన ప్రధాన జీవిత ఆశయంగా ప్రభుత్వ గ్రాంట్ల కోసం కాలేజీలో విద్యార్థుల సంఖ్య పెంచడం కోసం అహర్నిశలూ కృషి చేసిన శ్రామికుడు. తోటి ఉద్యోగులకు తన జీతాన్ని వారికిచ్చేసి తన కుటుంబ అవసరాన్ని త్యాగం చేసిన చైతన్యమూర్తి ప్రిన్సిపల్ సాగి వాసుదేవరాజు. ఆయన సతీమణి భారతీదేవి తన శక్తియుక్తులతో సంతోషంగా ఇద్దరు చిన్న బిడ్డలతో సంసారం గడిపిన వారి దాంపత్యం అపూర్వం. వారి అపూరూప చైతన్య పూరిత సహచర్యం యువతరానికి మార్గదర్శకం. ప్రిన్సిపల్‌గా వాసుదేవరాజు కాలేజీలో విద్యార్థుల సంఖ్య పెరగడం కోసం భీమవరంలోని డిఎన్‌ఆర్ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేసినా పెన్మత్స రామచంద్రరాజు (పిఆర్‌ఆర్) సహాయంతో భీమవరం దగ్గరలోని గ్రామాలకు ఇద్దరూ రిక్షాలో వెళ్లి ఇళ్లల్లోని వారి బిడ్డలను మూర్తి కాలేజీలో చేర్పించమని ప్రోత్సహిస్తూ ఎంతో మంది విద్యార్థులు జాయిన్ అయ్యేందుకు ఎంతోగానో ప్రయత్నించిన కార్యసాధకుడు వాసుదేవరాజు తెలిపారు. ప్రస్తుతం ఆ కాలేజీ ఎంతో అభివృద్ధి అయ్యింది. వాసుదేవరాజు 2009 జనవరి 5న భీమవరంలో మరణించారు. ఆయన త్యాగ శక్తి పెట్టుబడి అని తెలిపారు. ఆ దంపతులకు ఇద్దరు పిల్లలు. కొడుకు సాగి దివాకర్ వర్మలీల, కుమార్తె గొట్టుముక్కల శ్రీదేవి రామకృష్ణంరాజు. వాసుదేవరాజు తల్లిదండ్రులు సాగి సీతారామరాజు, సుభద్రాదేవి. ఆయన సోదరులు సాగి జానకీరామరాజు, మధుసూదనరాజు, వేణుగోపాల రాజు, అక్కచెల్లెల్లు వరలక్ష్మి, సీతాదేవి, సత్యవతి, భవాని, సావిత్రీదేవి. సంస్కారవంతమైన పెద్ద కుటుంబం వాసుదేవర రాజుది. వాసుదేవరాజు సంస్మరణార్థం.

- అల్లూరు మన్మోహిని

రూట్స్‌కు ఎక్సలెన్స్ అవార్డు

ప్రజాశక్తి - తణుకురూరల్

హైదరాబాద్ హైటెక్స్‌లో బ్రెయిన్‌ఫీడ్ ఇంటర్నేషనల్ మ్యాగ్జైన్ నిర్వహించిన 10వ నేషనల్ కాన్ఫరెన్స్‌లో రూట్స్ స్కూల్ 'ఎక్సలెన్స్' అవార్డు పొందినట్లు ప్రిన్సిపల్ ఎల్‌కె.త్రిపాఠి గురువారం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ నేషనల్ కాన్ఫరెన్స్‌లో జాతీయ స్థాయిలో అన్ని రాష్ట్రాలకు చెందిన 500 ఉత్తమ పాఠశాలలకు స్కూల్ ఎక్సలెన్స్ అవార్డును అందజేశారన్నారు. పాఠశాలల్లో బోధనా పద్ధతులు, విద్యేతర కార్యక్రమాలు తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని అవార్డులకు పాఠశాలలను ఎంపిక చేశారన్నారు. అవార్డుల ప్రదానోత్సవంలో తెలంగాణ ట్రాన్స్‌పోర్టు మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎన్‌ఐఎస్‌ఎ అధ్యక్షులు కుల్‌భూషణ్‌శర్మ, ఉపాధ్యక్షులు మధుసూదన్, ట్రాస్మ(టిఆర్‌ఎస్‌ఎమ్‌ఎ) అధ్యక్షులు డా పరమజ్యోతి, బ్రెయిన్‌ఫీడ్ మ్యాగజైన్ చీఫ్ ఎడిటర్ కెవి బ్రహ్మం పాల్గొన్నారన్నారు. తణుకు పట్టణానికి చెందిన రూట్స్ పాఠశాలకు ఈ అవార్డు రావడం విశేషమన్నారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్లు ఎల్‌కె త్రిపాఠి, ఎన్ సుధాకర్‌వర్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పట్టణ ప్రముఖులు డైరెక్టర్ బి.విద్యాకాంత్‌కు అభినందనలు తెలియజేశారు.

'సంక్షేమ పాలనకు మార్గదర్శి సిఎం జగన్'

ప్రజాశక్తి - ఆచంట

సంక్షేమ పాలనకు మార్గదర్శి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాధరాజు అన్నారు. కొడమంచిలిలోని పెదపేటలో 110వ రోజు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత బడుగు బలహీన వర్గాలతోపాటు అగ్రవర్ణ నిరుపేదలను ఆర్థికంగా నిలబెట్టాలనేదే ముఖ్యమంత్రి లక్ష్యమన్నారు. దళితవాడల అభివృద్ధికి తాను కృషి చేస్తానని తెలిపారు. పెదపేటలో డ్రెయినేజీ, సీసీ రోడ్డు నిర్మాణం చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆచంట ఎఎంసి చైర్మన్ చిల్లే లావణ్య, మాజీ ఎఎంసి చైర్మన్ సుంకర ఇందిరా సీతారామ్, సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్, ఎంపిటిసి పాల్గొన్నారు.

CHANGE OF NAME

I VIDIYALA KRISHNAMURTHY (NEW NAME),S/O.VIDIYALA RAMANNA , HOUSE.NO:2-108 , O.C.COLONY ,VELLAMILLI, OLD DIST W. G.DIST - NEW DIST ELURU, A.P-534 411 .IS HEREBY INFORMED TO THE PUBLIC BY PAPER PUBLICATION . THAT NOW CHANGED MY NAME **VIDIYALA KRISHNA** (OLD NAME) **VIDIYALA KRISHNAMURTY** (NEW NAME)TODAY ONWARDS USE MY NAME FOR ALL FURTHER TRANSACTIONS.

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, ఉండి మండలం, కోలమూరు గ్రామ కాపురస్తులయిన ఇంటి గోపి, S/o. బుచ్చయ్య అను నేను నాయొక్క పాస్‌పోర్టు ఉండి నుంచి కోలమూరు బండిపై వస్తుండగా మార్గమధ్యలో బండికి ఉన్న పాస్‌పోర్టు కవరు ఎక్కడో పడిపోయినది. ఆ చుట్టుప్రక్కల అంతా వెతికి చూసాను. ఎక్కడ కనిపించలేదు. నా పాస్‌పోర్టు నెంబర్ **P9982574.** కావున పాస్‌పోర్టు దొరికినవారు ఈక్రింది ఫోన్ నెంబరుకు తెలియజేయవలసిందిగా కోరుచున్నాము.

ఇంటి గోపి, S/o. బుచ్చయ్య
కోలమూరు, ఉండి మండలం
ప॥గో॥జిల్లా, సెల్: 9989242121

పాస్‌పోర్టు పోయినది

ఏలూరు జిల్లా, గణపవరం మండలం, ముగ్గళ్ళ గ్రామ కాపురస్తులయిన బుత్తల లక్ష్మీ భారతి, W/o. వెంకటేశ్వరరావు అను నేను నాయొక్క పాస్‌పోర్టు ముగ్గళ్ళ నుండి గణపవరం మోటార్ సైకిల్‌పై వెళ్ళే దారిలో నా పాస్‌పోర్టు ఉన్న కవరు పడిపోయినది. పాస్‌పోర్టు నెంబర్ **N2885825** గల పాస్‌పోర్టు దొరికినవారు ఈక్రింది ఫోన్ నెంబరుకు తెలియజేయవలసిందిగా కోరుచున్నాము.

బుత్తల లక్ష్మి భారతి
భర్త: వెంకటేశ్వరరావు
ముగ్గళ్ళ, గణపవరం మండలం
ఏలూరు జిల్లా, ఫోన్: 9966248330

ముత్యాలమ్మకు రూ.10.32 లక్షల ఆదాయం

మొగల్తూరు: ముత్యాలపల్లిలోని బండి ముత్యా లమ్మ అమ్మవారి హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించామని ఆలయ కార్యనిర్వహణాధికారి డి రామకృష్ణంరాజు తెలిపారు. మొత్తం రూ.10,32,665 ఆదాయం సమకూరిందని తెలిపారు.

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, తణుకు మండలం, దువ్వ గ్రామానికి చెందిన తోట అమ్మిరాజు, S/o. వెంకటేశ్వరరావు పాస్‌పోర్టు నెంబర్ **K2275822** గ్రామం నుండి తణుకు వెళ్తుండగా మార్గ మధ్యలో పడిపోయినది. దొరికినవారు క్రింది అడ్రస్‌కు అందచేయగలరు.

అడ్రస్: తోట అమ్మిరాజు
S/o.వెంకటేశ్వరరావు, హౌస్ నెం. 8-86,
10వ వార్డు, సంత మార్కెట్, దువ్వ,
తణుకు మండలం-534156, ప॥గో॥జిల్లా,
ఫోన్: 9951792911

నోటీసు

మహారాజశ్రీ కొవ్వూరు 2వ అదనపు జ్యుడిషల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టులో

Crl.M.P. No. 711/2020
C.C.S.r.No. 473/2020

Between:

1. ముత్యాల మధుబాబు -పిటీషనర్/ఫిర్యాది

మరియు

1. నందమూరి వెంకన్న, తండ్రి: మస్తాన్, ఫీల్డ్ ఆపరేటర్ ఇన్ ఓ.యన్.జి.సి., ప్లాట్ నెం. 52, రుస్తుంబాద, హౌసింగ్ బోర్డు కాలనీ, నరసాపురం, నరసాపురం మండలం, పశ్చిమగోదావరి జిల్లా. -రెస్పాండెంటు/ ముద్దాయి

పై నెంబరు కేసులో రెస్పాండెంటు/ ముద్దాయి అయిన మీకు ఎన్నిసార్లు సమన్లు రిజిష్టర్డు పోస్టులోను మరియు శ్రీ కోర్టు వారి ద్వారానూ పంపించుచున్నప్పటికీ వాటిని మీరు తీసుకొనకుండా ఉద్దేశ్యపూర్వకంగా నిలువరించుచున్నారు. కావున శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం **దీ. 24-01-2023వ తేదీ ఉదయం 10.30 ని॥లకు** పై కోర్టు వారి సమక్షమున స్వయంగా హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేని యెడల పరోక్షమున తీర్మానించబడును.

వాయిదా తేది: 24-01-2023

స్థలం: కొవ్వూరు **కె.వి.వి.హరిమోహన్**
తేది:05-01-2023 అడ్వకేట్, కొవ్వూరు

In the Court of the I Additional Junior Civil Judge, Tanuku

O.S. 286/2020

Between:
Bank of Baroda (Erstwhile Vijaya Bank), Alamuru ***...Plaintiff***
Vs
Tholeti Venkata Krishnarao and Other ***...Defendants***

వాది తరుపున చేసిన ప్రకటన

ప్రతివాదులు:
1. తోలేటి వెంకట కృష్ణారావు, S/o. నాగరాజు, హిందువు, పురుషుడు, 50 సం॥లు, పాలకొల్లు.
2. వేముల వెంకటలక్ష్మి, W/o. వర్ధనరావు, హిందువు, స్త్రీ, 34 సం॥లు, పాలకొల్లు.

పై నెంబరు దావా గ్రంథములో ప్రతివాదులైన మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపించిననూ మీకు అమలు జరగనందున శ్రీ కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది ఏమనగా మీరు **దీ. 06-1-2023 తేదీన ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయముగా గాని, ప్లీడరు ద్వారా గాని పై కోర్టు నందు హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినదిగాను, అట్లుకాని యెడల మీపై పరోక్షమున తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియపర్చడమైనది.

N.RAVI SHANKAR
Advocate, Tanuku

In the Court of the I Additional Junior Civil Judge, Tanuku

O.S. 655/2020

Between:
Bank of Baroda (Erstwhile Vijaya Bank), Alamuru ***...Plaintiff***
Vs
Midde Venkateswara and Other ***...Defendants***

వాది తరుపున చేసిన ప్రకటన

ప్రతివాదులు:
1. మిద్దే వెంకటేశ్వరరావు, S/o. గంగయ్య, హిందువు, పురుషుడు, గగ్గిపర్రు, యలమంచిలి మండలం.
2. తొంట జయలక్ష్మి, W/o. శ్రీనివాసరావు, హిందువు, స్త్రీ, పాలకొల్లు.

పై నెంబరు దావా గ్రంథములో ప్రతివాదులైన మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపించిననూ మీకు అమలు జరగనందున శ్రీ కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది ఏమనగా మీరు **దీ. 06-1-2023 తేదీన ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయముగా గాని, ప్లీడరు ద్వారా గాని పై కోర్టు నందు హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినదిగాను, అట్లుకాని యెడల మీపై పరోక్షమున తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియపర్చడమైనది.

D.S.V.KRISHNAJI
Advocate, Tanuku

In the Court of the I Additional Junior Civil Judge, Tanuku

O.S. 592/2020

Between:
Bank of Baroda (Erstwhile Vijaya Bank), Alamuru ***...Plaintiff***
Vs
Borra Prakasha Rao and other ***...Defendants***

వాది తరుపున చేసిన ప్రకటన

ప్రతివాదులు:
1. బొర్రా ప్రకాశరావు, S/o. వెంకటేశ్వరరావు, హిందువు, పురుషుడు, 50 సం॥లు, గగ్గిపర్రు, యలమంచిలి మండలం.
2. వేముల సూర్య వంశీధర్, S/o. చంద్రశేఖర్, హిందువు, పురుషుడు, 38 సం॥లు, గగ్గిపర్రు, యలమంచిలి మండలం.

పై నెంబరు దావా గ్రంథములో ప్రతివాదులైన మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపించిననూ మీకు అమలు జరగనందున శ్రీ కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది ఏమనగా మీరు **దీ. 06-1-2023 తేదీన ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయముగా గాని, ప్లీడరు ద్వారా గాని పై కోర్టు నందు హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినదిగాను, అట్లుకాని యెడల మీపై పరోక్షమున తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియపర్చడమైనది.

T.RAMADEVI
Advocate, Tanuku